క్లుప్తంగా

సత్కారం

మదనపల్లె: వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ జి.షమీంఅస్లాంను సోమవారం వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎస్ఏ.కరీముల్లా, మున్సిపల్ కౌన్సిలర్ షబానాలు శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వారి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సత్యనారాయణ స్వామికి అభిషేకం

పెద్దతిప్పసముద్రం: ఆశ్వయుజ పూర్ణిమ సాయంకాలం సందర్భంగాగా సోమవారం శివాలయం సేవకులు ననగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతంతో పాటు వేద పండితులు స్వామి వారి ప్రతిమకు భక్తి శ్రద్ధలతో అభిషేకించారు. భక్తులు పాల్గొని పూజల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

జూదరుల అరెస్ట్

గుర్రంకొండ: జూదమాడుతున్న ఎనిమిదిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన మండలకేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. సోమవారం గ్రామానికి సమీపంలోని ఎనుగుల చెరువు వద్ద ఉన్న ఓ రైస్‌మిల్ వెనుక వైపు భారీగా జూదం నిర్వహిస్తున్నరనే సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుర్రంకొండ, సంగసముద్రం గ్రామాలకు చెందిన ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రఘురామ్ తెలిపారు. జూదరుల నుంచి రూ. 5,100 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన పేర్కొన్నారు. జూదరులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

పరామర్శ

కలికిరి (వాల్మీకిపురం) : వాల్మీకిపురం మండలం గండబోయనపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సాధిక్ కుమారుడు మహమ్మద్ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏపీ ఎండీసీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి హరీష్‌రెడ్డి గండబోయనపల్లెకు చేరుకుని మహమ్మద్ మృతదేహానికి నివాళులర్పించారు. సాధిక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కృష్ణాంజనేయులు, రాజన్న, కిషోర్‌రెడ్డి, షరీఫ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పీలేరు పంచాయతీ ఈఓగా బ్రహ్మానందరెడ్డి



పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి ఈఓగా సోమవారం బ్రహ్మానందరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈఓగా పని చేస్తున్న లతీఫ్‌ఖాన్ పదోన్నతిపై రామసముద్రం మండలానికి ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానిక గుర్రంకొండ మండలంలో డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తున్న బ్రహ్మానందరెడ్డి ఎఫ్ఏసీపై పీలేరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, వీధిలైట్ల ఏర్పాటుకు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగింపు



అమ్మచెరువుమిట్టలో అక్రమ కట్టడాలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మదనపల్లె రూరల్: పట్టణంలోని బికె.పల్లి, వైఎస్సార్ నగర్, అమ్మచెరువుమిట్టలోని ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. సోమవారం తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు వీఆర్ఓ ప్రవీణ్ బికెపల్లె, శ్రీవారినగర్, వైఎస్సార్ కాలనీ తదితర ప్రాంతాల్లో 8 చోట్ల పునాదులు నిర్మించినట్లు గుర్తించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వాటిని పూర్తిగా తొలగించారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా భూమికి సంబంధించి పట్టా లేకున్నా చేస్తున్న నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

పెద్దతిప్పసముద్రం: ములకలచెరువులో తెలుగు తమ్ముళ్ల కల్తీ మద్యం తయారీ అంతర్జాతీయ మాఫీయాను తలపించేలా పోలీసు దాడుల్లో గుట్టు రట్టు కావడం రాష్ట్రంలో తీవ్ర ప్రకంపనలు రేపింది. పట్టుబడిన కల్తీ మద్యం కేసులో ఇప్పటికే పలువురు రిమాండ్‌లో ఉండగా ఇన్నాళ్ళూ తయారీ కేంద్రం నుంచి బెల్ట్‌షాపులకు కల్తీ మద్యం బాటిళ్ళను రవాణా చేసిన వారు, మద్యం నిల్వలకు సహకరించారని అనుమానాలు ఉన్న మరి కొందరు నిందితులు పరారీ కావడంతో పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో బెల్ట్‌షాపులపై విస్తృతంగా తనిఖీ చేపట్టారు. సోమవారం ఎస్ఐ హరిహరప్రసాద్ సిబ్బందితో కలసి కల్తీ మద్యం నిల్వలు, పేకాట స్థావరాలలతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు అనుమానాలు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్‌తో పరిశీలించారు.

నకిలీ మద్యంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

సమన్వయకర్త నిసార్ అహ్మద్ డిమాండ్



మాట్లాడుతున్న నిసార్ అహ్మద్



తంబళ్లపల్లెలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె : ములకలచెరువు నకిలీ మద్యం తయారీ రాకెట్ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్ఆర్సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ములకలచెరువులో టీడీపీ నాయకుల కనుసన్నల్లో జరిగిన నకిలీ మద్యం తయారీపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం పరిశ్రమలు ఇంకేన్ని ఉన్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. నకిలీమద్యం ఏడాది కాలంగా జరుగుతోందని, ఇప్పటి వరకు ఎంత అమ్మకాలు సాగించారు, తాగి ఎంతమంది అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరారో లెక్కలు తీయాలని కోరారు. ప్రభుత్వంలో బలమైన వ్యక్తుల సహకారం లేనిది నకిలీ మద్యం తయారీ సాధ్యం కాదన్నారు. ఇందుకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలపై విచారణ చేసి, ఈ డబ్బు ఎవరికి చేరాయో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సూత్రదారు జనార్ధన రావు వెనుక ఎవరున్నారో తెలియాలి అంటే కేసు హైకోర్టు సిట్టింగ్ జడ్జికి అప్పగించాలని కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడిన వారిపై సీఎం చంద్రబాబునాయుడు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు రాష్ట్రానికి తెచ్చిన పరిశ్రమలు ఏమన్నా ఉన్నది అంటే అది కల్తీ మద్యం పరిశ్రమ తప్ప మరొకటి లేదన్నారు. కల్తీ మద్యం సేవించి అనారోగ్యం పాలైన వారిని గుర్తించి వారికి నకిలీ మద్యం తయారు దారుల నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా ఆరోగ్య పరీక్ష నిర్వహించి, తగిన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సిట్టింగ్ హైకోర్టు జడ్జి తో విచారణ చేయించలేని పక్షంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం తయారీ కేసును సీబీఐతో విచారణ జరిపించాలి

తంబళ్లపల్లె: ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేసును సీబీఐ ,సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఇంటి వద్ద విలేకర్ల సమావేశంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. నిరుపేదల రక్తం పీల్చి వారి ప్రాణాలతో చెలగాటం ఆడటం, నకిలీ మద్యం తయారీతో స్వార్థం కోసం టీడీపీ నాయకుల దౌర్భాగ్యమన్నారు. ఎన్నికల సమయంలో జయచంద్రారెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధికి కృషి చేస్తానని ఏకంగా సౌత్ ఆఫ్రికా నుంచి ములకలచెరువుకు నకిలీ మద్యం తయారీ పరిశ్రమను తీసుకువచ్చిన ఘనత దక్కించుకున్నారన్నారు. నియోజకవర్గంలో కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్న ఘనత ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిది అన్నారు. ఈ కేసును సీబీఐతో విచారణ జరపకపోతే వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మద్యం తయారీ కేంద్రం స్థలం ఓనర్‌ను, వ్యాన్ డ్రైవర్లను ఎందుకు విచారించి అరెస్టు చేయలేదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు కోటిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భద్ర, రామమూర్తి, నారాయణరెడ్డి, సర్పంచు రెడ్డినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ జరపాలి



మాట్లాడుతున్న టి.ఎల్. వెంకటేష్

పీలేరు రూరల్ : కల్తీ మద్యం తయారీ చేస్తున్న వారిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో లిక్కర్ స్కామ్ జరిగిందో లేదో తెలియదు కానీ, ఆరోపణలతో వైఎస్సార్‌సీపీ నాయకులు అరెస్ట్ చేసి జైలుకు పంపించిన విషయం రాష్ట్ర ప్రజలందరూ చూశారని తెలిపారు. ములకలచెరువులో కల్తీ మద్యం తయారీలో టీడీపీ వారి హస్తం ఉందని తెలిసిన నేపథ్యంలో టీడీపీ అధిష్టానం మాత్రం కంటితుడుపు చర్యగా పార్టీ నుంచి సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో మద్యం ఏరులై పారుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు తెరచి మద్యం డోర్ డెలివరీ చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం మద్యం విక్రయాలతో అధిక సంపాదనతో ఖజానా నింపుకోవాలని చూస్తుంటే కింది స్థాయి అధికారులు వైన్‌షాపులను మూడు పూలు, ఆరు కాయలుగా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కల్తీ మద్యంతో అనేక కుటుంబాలు వీధినపడ్డాయని, దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వం ఆదాయం పాకులాడుతూ వైన్‌షాపుల పక్కన సిట్టింగ్ రూముల ఏర్పాటు సన్నాహాలు చేయడం సరైంది కాదన్నారు.

ఖతీబ్ భూముల సర్వే నిలిపివేయండి



తహసీల్దార్ లక్ష్మీప్రసన్నకు ఫిర్యాదు చేస్తున్న ఖతీబ్ ఇనామ్ భూముల రైతులు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో ఖతీబ్ ఇనామ్ భూముల్లో వక్ఫ్‌బోర్డు అధికారులు చేపట్టిన సర్వే పనులను వెంటనే నిలిపివేయాలని రైతులు తహసీల్దార్ లక్ష్మీప్రసన్నను కోరారు. సోమవారం ఖతీబ్‌ఇనామ్ భూముల్లో వ్యవసాయం చేసుకొంటున్న రైతులందరూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా గ్రామానికి సమీపంలోని ఖతీబ్ ఇనామ్ భూములు 165 ఎకరాల్లో 140 మంది రైతులు వ్యవసాయం చేసుకొంటున్నామన్నారు. వీటికి సంబంధించి ఆధారాలు తమవద్ద ఉన్నాయన్నారు. అయితే వక్ఫ్ బోర్డు అధికారులు తాము సాగు చేసుకొంటున్న భూములు వక్ఫ్‌బోర్డుకు చెందనవిగా భావించి మాకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేశారన్నారు. భూములను సాగు చేసుకొంటున్న మాకు సమాచారం ఇవ్వకుండా సర్వే పనులు చేపట్టడం తగదన్నారు. అసలు ఖతీబ్ ఇనామ్ భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో శ్రీరాములు అనే వ్యక్తి పేరుతో ఉందన్నారు. తాము 15 ఏళ్లుగా ఎన్నోమార్లు అర్జీలు ఇచ్చినా సదరు శ్రీరాములు పేరును అడంగల్, ఒన్‌బీలలో తొలగించలేదన్నారు. శ్రీరాములు పేరు రెవెన్యూ రికార్డుల్లో తొలగించి తమ భూములు తమకు అప్పగించాలని కోరారు. ఈవిషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

-ఎంపీపీ నరసింహులు



మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

నిమ్మనపల్లె: అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమష్టిగా కృషి చేస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ నరసింహులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధిచిన అధికారులతో గడిచిన మూడు నెలలో చేసిన అభివృద్ధి, వెచ్చించిన నిధులపై సమీక్షించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం వంటి వాటికి అధిక ప్రాధాన్యతను కల్పించాలన్నారు. ఎంపీడీఓ రమేష్‌బాబు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణతో పాటు మురుగునీటి కాలువలు క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రైతులు సాగు చేసిన ప్రతి పంట వివరాలు అక్టోబర్ 31వతేదీలోపు తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ మంజుల అన్నారు. పశువులకు తప్పనిసరిగా ఇన్సూరెన్సు చేయించుకోవాలని పశువైద్యాధికారి సురేష్ తెలిపారు. ఎంపీటీసీలు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ మద్యం ఏరులైపారుతోందని, బెల్ట్ షాప్‌లను అరికట్టాలన్నారు. నిమ్మనపల్లె నుంచి వాల్మీకిపురంకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ మార్గంలో బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయప్రకాష్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు రీసర్వే డీటీ సిరాజుద్దీన్, ఎంఈఓలు పద్మావతి, నారాయణ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీడీసీ మెంబర్ హర్షవర్ధన్‌రెడ్డి మృతి తీరని లోటు

మదనపల్లె సిటీ: ప్రముఖ పారిశ్రామికవేత్త, కాలేజీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సభ్యుడు టీఎస్ హర్షవర్ధన్‌రెడ్డి మృతి తీరని లోటని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. సోమవారం కాలేజీలో ఆయన మృతికి విద్యార్థులతో కలిసి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతుడు కాలేజీ అభివృద్ధి కోసం కంప్యూటర్ ల్యాబ్ నిర్మించారని, వంద డెస్కులు ఉచితంగా అందజేశారన్నారు. ఆయన కాలేజీ కోసం తన వంతు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌వల్లి, విష్ణుప్రియ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆట్టహాసంగా డివిజన్ స్కూల్‌గేమ్స్ పోటీలు



అండర్-17 వాలీబాల్ బాలికల విజేతల జట్టుతో కోచ్‌లు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం డివిజన్ స్కూల్‌గేమ్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్-14,-17 బాల,బాలికలకు వాలీబాల్, యోగా, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు డివిజన్ కో ఆర్డినేటర్ భద్రయ్య తెలిపారు. వాలీబాల్ విభాగంలో అండర్-14 బాలుర విజేతగా నిమ్మనపల్లె, రన్నర్స్‌గా బీ.కొత్తకోట నిలిచాయి. అండర్-14 బాలికల విజేతగా రామసముద్రం, రన్నర్స్‌గా తంబళ్లపల్లె గెలిచాయి. అండర్-17 బాలికల విజేతగా రామసముద్రం, రన్నర్స్‌గా ములకలచెరువు నిలిచాయి. అండర్-17 బాలుర విజేతగా తంబళ్లపల్లె, రన్నర్స్‌గా ములకలచెరువు నిలిచాయి. అండర్-17 బాలుర విజేతగా తంబళ్లపల్లె, రన్నర్స్‌గా పెద్దమండ్యం నిలిచాయి. బ్యాండిటన్ విభాగంలో అండర్-17 బాలికల విభాగంలో పి.శరణ్య(ఢిల్లీపబ్లిక్ స్కూల్),మోక్షిత(వశిష్ఠ స్కూల్)లు నిలిచాయి. అండర్-17 బాలుర విభాగంలో కుశల్ (భాష్యం), సుభాహాన్ (చెంబకూరు) నిలిచారు. అండర్-14 బాలికల విభాగంలో సుశీల(వశిష్ఠ స్కూల్), చైత్రదర్శిని (భాష్యం) నిలిచాయి. అండర్-14 బాలుర విభాగంలో మౌనిష్ (భాష్యం), నజీప్ (భాష్యం) నిలిచారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, డివిజనల్ కో ఆర్డినేటర్లు శివశంకర్, భద్రయ్య, దిలీల్, పీడీలు దేవకమ్మ, అన్సర్, జలజ, నరేష్, శారద బాలాజీ, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల సంబరాలు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డిని ఆ పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు వెలువడటంతో ఆదివారం రాత్రి బి.కొత్తకోటలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గీయులు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. నినాదాలు చేస్తుండటంతో వారివద్దకు చేరుకున్న పోలీసులు అందర్ని అక్కడినుంచి పంపేశారు.

యంత్రాలతో చేసిన ఉపాధి పనులపై విచారణ



శెట్టివారిపల్లెలో జేసీబీ యంత్రాలతో ఉపాధి పనులు చేపట్టడంపై విచారణ చేస్తున్న అధికారులు

గుర్రంకొండ: మండలంలోని శెట్టివారిపల్లెలో జేసీబీ యంత్రాలతో ఉపాధి హామీపనులు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం ప్రచురితమైన జేసీబీ యంత్రాలతో ఉపాధి పనులు కథనానికి అధికారులు స్పందించారు. ఏపీఓ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం గ్రామంలో పర్యటించారు. రైతు సుధాకర్ పొలంలో చేపట్టిన మామిడితోటల పెంపకాన్ని పరిశీలించారు. పొలంలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలను విచారించారు. మొత్తం మూడు ఎకరాల్లో మామిడితోటల పెంచేందుకు గానూ ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. మూడు ఎకరాల్లో 210 మొక్కల పెంపకానికి సంబంధించి గుంతలు తవ్వే పనులు కూలీలు పనిచేసినట్లు విచారణలో తేలింది.

సాక్షి ఎఫెక్ట్..

గుట్టలు చదును చేయించి మిగిలిన 90 గుంతలను రైతు జేసీబీ తవ్వించి టెంకాయ, అల్లనేరేడు, టేకు మొక్కలు నాటినట్లు విచారణలో తేలింది. జేసీబీతో పనులు చేసిన 90 గుంతలకు బిల్లులు నిలిపివేసి ఉపాధిహామీ పథకం కింద వీటికి ఎటువంటి చెల్లింపులు చేపట్టబోమని ఏపీఓ జయరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈసీ సుబ్బరాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు శంకరమ్మ, కుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ మనోహర్‌లు పాల్గొన్నారు.

కురవంక పంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ చలపతి

మదపల్లె రూరల్: మండలంలోని కురవంక గ్రామ పంచాయతీ స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర అవార్డు దక్కించుకుంది. సోమవారం ఈ అవార్డును జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతుల మీదుగా సర్పంచ్ పసుపులేటి చలపతి అందుకున్నారు. రానున్న రోజుల్లో పంచాయతీ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. అలాగే బెస్ట్ గ్రీన్ అంబాసిడర్‌గా పంచాయతీ వర్కర్ సురేష్‌కు అవార్డు దక్కింది.

మల్లయ్యకొండపై శివనామ సంకీర్తన



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భజన మండలి కళాకారుల శివనామ సంకీర్తనతో మారుమోగింది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవలచెరువు పర్తికోటకు చెందిన భజన మండలి కళాకారులు శివనామస్మరణతో భక్తులను అలరింపజేశారు. సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మదనపల్లె వన్ డీఎం వెంకటరమణారెడ్డి భక్తుల సౌకర్యం కోసం రెండు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

పది మంది జూదరుల అరెస్ట్

-రూ.4.23 లక్షలు స్వాధీనం

మదనపల్లె: మదనపల్లె రూరల్ మండలం బండకాడ పల్లి సమీపంలో పేకాట స్థావరంపై దాడులు జరిపి పది మందిని అరెస్టు చేశామని తాలూకా సిఐ కళా వెంకటరమణ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బండకాడపల్లె వద్ద పేకాడుతున్నట్లు సమాచారం అందింది. ఉన్నతాధికారుల సూచనలతో స్థావరంపై దాడులు జరిపగా పదిమంది జూదరులు పట్టుబడినట్లు తెలిపారు. అరెస్టు చేసి పేకాట శిబిరం నుంచి రూ.4,23,200 నగదు లభ్యమవ్వగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఐదు మోటార్ సైకిళ్ళు, 12 మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని, మరికొందరు పరారైనట్లు తెలిపారు. మదనపల్లెకి చెందిన అర్జున్ రెడ్డి, రమేష్ పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నట్లు తమదష్టికి వచ్చిందని వీరు పరారీ ఉన్నట్లు చెప్పారు. వారి పై కూడా కేసు నమోదు చేశామని చెప్పారు.

పొంగుతున్న చెరువులు, వాగులు



చలిమామిడి రోడ్డులో భారీగా ప్రవహిస్తున్న నీరు

బి.కొత్తకోట: మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు, వాగులు ప్రవహిస్తున్నాయి. బడికాయలపల్లె, సూరప్పగారిపల్లె, గట్టు గ్రామం చలిమామిడి ప్రాంతంలోని చెరువులు నిండి ప్రవహిస్తున్నాయి. డేగాని పల్లె-చలిమామిడి మార్గంలోని వాగు ప్రవాహం రోడ్డుపై నుంచి సాగుతుండటంతో మట్టి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి ప్రవాహం ఉన్న చోట జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లా ప్రకటించే దాకా ఉద్యమం



మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఎస్పీ ధర్నా

మదనపల్లె : మదనపల్లెను జిల్లాగా ప్రకటన చేసే దాక ఉద్యమాలు చేస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. గత ఎన్నికల్లో మదనపల్లెను జిల్లా చేస్తానని చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులకి భయపడేది లేదన్నారు. సబ్ కలెక్టర్ కేంద్ర మంత్రి రామ్మోహన్ బంధువు అయినప్పటికీ, న్యాయం అందించే విషయంలో అందరినీ సమానంగా చూడాలని కోరారు. ఏకపక్షంగా వ్యవహరించొద్దని కోరారు. ప్రజా ఉద్యమాల పట్ల అధికారులు పోలీసులు, చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. మదనపల్లెను జిల్లాగా ప్రకటించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహదేవ, బాలాజీ, రమణ, చంద్ర, శివ, లక్ష్మిపతి, అరుణ్, ప్రశాంత్, శ్రీనాథ్, సంధ్య, అనిల్ , ప్రసాద్, రెడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

సెరిబ్రల్ పాల్సీపై అవగాహన



మాట్లాడుతున్న వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సోమవారం ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీ అంటే మెదడు పక్షవాతం అనీ, ఇది ఒక రుగ్మత , దీనిని నయం చేయడానికి ఎలాంటి మందులు లేవన్నారు. సెరిబ్రల్‌పాల్సీ ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఆపరేషన్స్, సహాయ పరికరాలు ఉపయోగించడం ద్వారా రుగ్మత తీవ్రతను తగ్గించగలమన్నారు. సెరిబ్రల్ పాల్సీ గల జ్యోతి కిరణ్ తల్లి రాధమ్మ మాట్లాడుతూ మా బాబుకు ఎడమ చెయ్యి, ఎడవ కాలు సెరిబ్రల్ పాల్సీ ఉండటంతో ప్రతి రోజు ఫిజియోథెరపీ చేయిస్తున్నామన్నారు. దైనందిక కార్యక్రమాలు చేయించడం వల్ల కండరాల్లో కదలికలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.